క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7.30నుంచి 9.30గంటల వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ కాలనీ, నారాయణనగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల ప్రాంతం, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కోమటిపల్లిల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ ప్రాంతంలో 800ఎంఎం డయా పైపులైన్ లీకేజీ కారణంగా కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలో శనివారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు బల్దియా డీఈ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీకేజీ మరమ్మతుల కారణంగా హనుమకొండ పరిధిలోని విద్యారణ్యపురి, కుమార్‌పల్లి, రెడ్డికాలనీ, రాయపుర, పద్మాక్షి కాలనీ, కాకతీయ కాలనీ, ముచ్చర్ల, పెగడపల్లి, భీమారం, చింతట్టు, వంగపహాడ్, గుండ్ల సింగారం, పలివేల్పుల ప్రాంతాల్లో ఒక రోజు నీటి సరఫరా ఉండదని తెలిపారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఖిలా వరంగల్: కళా ఉత్సవ్ –2023 వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో జీహెచ్ఎస్ శంభునిపేట పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఫోక్ మ్యూజిక్ పోటీలకు పదో తరగతి విద్యార్థి వెంకటేష్, డ్రామా సోలో రాష్ట్ర స్థాయి పోటీలకు పదో తరగతి విద్యార్థి దినేష్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారిని ప్రధానోపాధ్యాయురాలు శారదబాయి, ఉపాధ్యాయులు ఆడెపు రవీందర్, లకుపతి శుక్రవారం అభినందించారు.

'భద్రకాళి'కి వీల్‌చైర్ల వితరణ



హన్మకొండ కల్చరల్: వరంగల్ పిన్నావారి వీధికి చెందిన కొమురవెల్లి శ్రీలత, శివకుమార్ దంపతులు భద్రకాళి దేవాలయానికి వీల్‌చైర్లను బహూకరించారు. దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు అవసరార్థం రెండు వీల్‌చైర్లను ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతికి శుక్రవారం అందించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నష్టం



దేశాయిపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నగరంలోని 12వ డివిజన్ దేశాయిపేట ఎస్సీ కాలనీకి చెందిన సిగ కరుణాకర్, సిగ జాన్సన్‌కు చెందిన రెండు ఇళ్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. ఈమేరకు వరంగల్ అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్ ఎండీ.షఫిపాషా తెలిపారు. ప్రమాదంలో టీవీ, ఫ్రిడ్జ్‌లు కాలిపోగా, సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని పేర్కొన్నారు. ఫైర్‌సిబ్బంది ఆర్.శ్రీనివాస్, శివకృష్ణ, మహేష్ పాల్గొన్నట్లు తెలిపారు.

'శివాని'లో ఫ్రెషర్స్ డే



హసన్‌పర్తి: నగరంలోని శివాని డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ వడ్డె సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీఎస్ ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పెరుమళ్ల వరలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగుర్ల సంజీవ్, సెక్రటరీ తాళ్లపల్లి స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ షాపులో తనిఖీలు

ఖిలా వరంగల్: మండల పరిధిలోని ఓ రేషన్ షాపులో సివిల్ సప్లై అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆ షాపులో 73.21 క్వింటాళ్ల బియ్యం ఉండాల్సి ఉండగా, 35.21 క్వింటాళ్ల స్టాక్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అవకతవకలకు పాల్పడిన సదరు రేషన్ డీలర్‌పై 6–ఏ కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

గ్రీన్ దీపావళి.. సామాజిక బాధ్యత

హసనపర్తి: వాయు కాలుష్యం లేని బాణసంచాను వాడాలని, సామాజిక బాధ్యతగా గ్రీన్ దీపావళిని జరుపుకోవాలని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక (యూఎఫ్ఈపీ) అధ్యక్షుడు పురుషోత్తం అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హసన్‌పర్తిలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ చదువుతో పాటు పర్యావరణ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వేదిక ప్రధాన కార్యదర్శి శ్రవణ్ మాట్లాడుతూ వాయు కాలుష్యంతో దేశ రాజధాని ఢిల్లీ అలాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు, శబ్ద కాలుష్యాల బారిన పడకుండా వరంగల్ నగరాన్ని రక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తుచేశారు. స్వచ్ఛమైన వాతావరణంలో దీపావళి పండుగా జరుపుకుంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఆకుతోట రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక ఉపాధ్యక్షుడు పిట్టల రవిబాబు, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హసనపర్తి: మాట్లాడుతున్న పురుషోత్తం



నయీంనగర్: దీపావళి వేడుకల్లో చిన్నారులు

'ఏకశిల'లో ఎకో ఫ్రెండ్లీ దీపావళి

నయీంనగర్: భారతీయ ధర్మానికి, సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను కాలుష్య రహితంగా జరుపుకోవాలని హనుమకొండ కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో ఉపాధ్యాయులు సూచించారు. ఈమేరకు పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి దీపపు ప్రమిదలతో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. దీపాలు, పూలతో అలంకరించిన రంగవల్లులు ఆకర్షించాయి. ఆధునిక రసాయనాలతో రూపొందుతున్న బాణసంచా వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటితో మానవాళికి కలిగే ప్రమాదాలను వివరించారు. కాలుష్య రహిత దీపావళిని ప్రతీఒక్కరు బాధ్యతగా జరుపుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, స్వాతి, కల్పన, సుమలత, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి రమేష్
- ప్రచారంలో గ్రామాల్లో అరూరికి అడుగడుగునా బతుకమ్మలు, మంగళ హారతులతో ఘన స్వాగతం



ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్



ర్యాలీగా వెళ్తున్న ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు

వర్ధన్నపేట: తనను రెండు పర్యాయాలు గెలిపిస్తే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపించానని, తిరిగి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చెన్నారం, కాశగూడెం, కడారిగూడెం, కుమ్మరిగూడెం, రాంధన్‌తండా, చంద్రుతండా, నల్లబెల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలు నెత్తిన పెట్టుకుని మంగళ హారతులతో గ్రామాల్లోకి ఆహ్వానించారు. కోలాటాలు, నృత్యాలు, డప్పులు వాయిస్తూ చేస్తూ రమేష్‌కు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో తాను వెనకడుగు వేసేది లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాలను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి రూ.4354 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా రైతు బంధు కోఆర్డినేటర్ లలితాయాదవ్, ఆత్మ జిల్లా చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్ ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

అరూరికి గౌడ సంఘం మద్దతు

హసన్‌పర్తి: నగరంలోని 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన గౌడ సంఘం బీఆర్ఎస్ అరూరికి సంపూర్ణ మద్దతు తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో అరూరిని శుక్రవారం కలిసి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుగులోతు దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజు నాయక్, ఆత్మ డైరెక్టర్ భూపాల్, రైతు సమితి అధ్యక్షుడు నద్దునూరి నాగరాజు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సాగర్ మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

65వ డివిజన్ మునిపల్లికి చెందిన ముదిరాజ్ యూత్ అసోసియేషన్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి అరూరి రమేష్ ఆహ్వానించారు.

కేడీసీ తెలుగు విభాగంలో వర్క్‌షాప్

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, కేడీసీ తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనాటి సందర్భాలు – ఆనాటి కథలు అనే అంశాలపై ప్రముఖ రచయిత కొడవటి కుటుంబరావు కథలను గ్రహించి విద్యార్థులతో శుక్రవారం కార్యశాల నిర్వహించారు. కేడీసీ తెలుగు విభాగం అధిపతి బాలయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ప్రజా రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ తిరునగరి దేవకీదేవి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి మల్లేశ్వరి, తదితరులు పాల్గొని మాట్లాడారు.



వర్క్‌షాప్‌లో అధ్యాపకులు, అతిథులు, విద్యార్థులు

ఎస్‌ఏ రైటింగ్‌లో మైరాకు బంగారు పతకం



రామన్నపేట: టాటా గ్రూపు ఆఫ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఏ రైటింగ్ జిల్లాస్థాయి పోటీల్లో మట్టివాడలోని ఎస్సార్ డాటన్స్ పాఠశాలకు చెందిన అలీజ మైరా.. బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ తమిక హారక మాట్లాడుతూ ఎస్ఏ రైటింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని మైరా.. బంగారు పతకం సాధించిందని తెలిపారు. ఈమేరకు హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



మడికొండ: దీపావళి పండుగను పురస్కరించుకొని నిరుపేద కుటుంబాలకు మడికొండ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీపండుగ రోజు పేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేస్తున్నట్లు తెలిపారు.

వేల మాటలను ఒక చిత్రం చెబుతుంది



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: వేల మాటలను ఒక చిత్రలేఖనం చెబుతుందని పోటీల ఇన్‌చార్జ్ రెవరెండ్ బ్రదర్ బాలవినోద్ రెడ్డి అన్నారు. కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాబ్రియల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పాలిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సాహించాలని కోరారు. చిత్రలేఖనం పోటీల్లో 20పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విహార యాత్ర, ఇష్టమైన పండుగ, తుపాను విధ్వంసం అనే అంశాలను విద్యార్థులు చిత్రకళను ప్రదర్శించారు. అనంతరం విజేతల పేర్లను ఆయా పాఠశాలలకు పంపించనున్నారు. ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ స్లీవారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో స్నిగ్ధకు బహుమతి



హన్మకొండ కల్చరల్: విద్యార్థుల కళాప్రతిభను ప్రోత్సహించడానికి కేంద్ర విద్యాశాఖ, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకత్వంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రాక్టీసింగ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ –2023 పోటీల్లో హనుమకొండకు చెందిన స్నిగ్ధ సిరిమల్లి శాస్త్రీయ నృత్యవిభాగంలో ప్రథమ బహుమతి అందుకుంది. స్నిగ్ధ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీశివానంద నృత్యమాల నృత్య కళాక్షేత్రం నిర్వాహకుడు, ప్రముఖ నృత్యగురువు బొంపెల్లి సుధీర్‌రావు వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతోంది.

దార్శనికుడు మౌలానా అబుల్ కలాం

కేయూ క్యాంపస్: గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలాం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. క్యాంపస్‌లోని మౌలానా అబుల్ కలాం సెంటర్ ఫర్ మైనార్టీస్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కనీజ్ ఫాతిమా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మౌలానా అబుల్ కలాం జయంతి (ముందస్తు)సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లాంటి జాతీయ సంస్థల స్థాపన కలాం చలువేనని గుర్తుచేశారు. విద్యావ్యాప్తి ద్వారా సమాజం చైతన్యం, అభివృద్ధి జరుగుతుందని వివరించారు. దేశంలోనే అక్షరాస్యత శాతం పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యను ప్రతీఒక్కరు హక్కుగా భావించాలన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మహ్మద్ ఇక్బాల్‌అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు. తొలుత అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, తదితరులు

ప్రైవేట్ వాహన డ్రైవర్లను ఆదుకోవాలి

హన్మకొండ: ప్రైవేట్ డ్రైవర్లను ఆదుకునేందుకు చేపట్టనున్న కార్యాచరణను బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. హనుమకొండ సుబేదారిలో ప్రజావేదిక, ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, క్యాబ్, లారీ, ట్రక్, బస్ డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు వాహన బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సొంత వాహనదారులకు పన్నుల మినహాయింపు ఇచ్చేలా మేనిఫెస్టోలో చేర్చాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వాహనమిత్ర పథకం ద్వారా ప్రతి సంవత్సరం రూ.10 వేలు అందిస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా ప్రైవేట్ డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు కూడా అందించాలని కోరారు. సమావేశంలో ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్, రవి, నరేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేషు

పోక్సో కేసులో ఇద్దరి అరెస్ట్



కాజీపేట: బాలికను బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టిన యువకుడితో పాటు అందుకు సహకరించిన లాడ్జి యజమానిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ కాజీపేట 63వ డివిజన్ కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన బొక్క అభిలాష్ అనే యువకుడు ఓ బాలికను బెదిరించి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని హనుమకొండ కొత్త బస్టాండు ప్రాంతంలోని లాడ్జిలో బలవంతంగా అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అభిలాష్‌తో పాటు లాడ్జి ఓనర్ శ్రీరాముల వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు, ఎస్సై లలిత పాల్గొన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం



ఆయుర్వేద బోధన వైద్యశాలలో ధన్వంతరి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కాశిబుగ్గ: జాతీయ ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, బోధన వైద్యశాలలో వేర్వేరుగా ఆయుర్వేద దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, బోధన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోనాచారి ఆధ్వర్యంలో ధన్వంతరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది పురాతన భారతీయ వైద్య విధానం అని వివరించారు. అనేక దీర్ఘకాలిక వ్యాధులు ఆయుర్వేదంతో పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ప్రొఫెసర్లు, వైద్యులు, కళాశాల, వైద్యశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి తాళం వేసి తరలిరావాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: ఇంటికి తాళం వేసి పల్లెలు.. హైదరాబాద్ బాటపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట రవిమాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ హసన్‌పర్తి సెంటర్‌లో డప్పుచప్పుళ్లతో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి మోదీ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సభలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై మోదీ స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని చెప్పారు. విశ్వరూప సభకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యకమంలో నాయకులు ఆరెపల్లి పవన్, బోడ యుగంధర్, పుల్లా దుర్గారాం, బొక్క కుమార్, బోడ సాంబయ్య, తాళ్ల శ్యామ్, శ్రీను, వీరేందర్, రామకోటి, శ్రావణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థికి ప్రొఫెసర్ ఆర్థికసాయం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భార్గవికి కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. భార్గవికి తల్లి లేదు. తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని చదువు కోసం, ప్రైవేట్ హాస్టల్‌లో ఉండేందుకు నెలకు రూ 3,500 చొప్పున మెస్‌బిల్ పేమెంట్‌కు రూ.40 వేల చెక్కు అందజేసినట్లు సమ్మయ్య తెలిపారు. తన గురువు కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనతో కలిసి చెక్కును భార్గవికి సమ్మయ్య అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ జనపరెడ్డి కృష్ణవేణి, అధ్యాపకుడు డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

యశోదలో అరుదైన శస్త్రచికిత్స

హన్మకొండ: సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సను గ్రౌండింగ్ బ్రేకింగ్ సర్జికల్ ప్రొసీజర్ విధానంతో విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కేఎస్.కిరణ్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని యశోద క్లినిక్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరకాల మండలం వెల్లంపల్లికి చెందిన రమేష్ తలలో ఎడమ వైపు ఏర్పడిన కణతిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించినట్లు వివరించారు. ఎడమ మోటర్ కరెక్ట్‌పై గ్లియోమా కణతిని విజయవంతంగా తొలగించినట్లు తెలిపారు. రోగి భద్రతకు ప్రాధాన్యతమిస్తూ అత్యంత నిష్ణాతులైన వైద్య బృందంతో అధునాతన శస్త్ర చికిత్స పద్ధతుల కలయిక ద్వారా ఉత్తమ ఫలితం సాధించినట్లు వివరించారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్య అధికారులను, సిబ్బందిని అభినందించారు.



18కిలోల గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్: ఒడిశా రాష్ట్రంలోని సంబల్‌పూర్ నుంచి రైలు మార్గం ద్వారా వరంగల్ మీదుగా మహారాష్ట్రలోని సోలాపూర్‌కు ఎండు గంజాయి తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4.50లక్షల విలువైన 18కిలోల ఎండు గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

'పీఎం శ్రీ'గా కేంద్రీయ విద్యాలయ



పీఎం శ్రీ కేవీ వరంగల్ బోర్డును ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్‌ను పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయగా కేంద్ర విద్యాశాఖ మార్పు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ ఎడ్యుకేషన్ –2020 పాలసీలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 535 కేవీ పాఠశాలలను పీఎం శ్రీ కేవీలుగా రూపాంతరం చేసేందుకు శ్రీకారం చుట్టగా అందులో కేవీ వరంగల్ చోటు దక్కించుకుంది. కేవీ వరంగల్‌ను పీఎం శ్రీ కేవీ వరంగల్‌గా మారుస్తూ శుక్రవారం ఏర్పాటు చేసిన పాఠశాల బోర్డును విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. కేవీ వరంగల్‌కు తొలి విడతో రూ.20 లక్షల నిధులను కేంద్రం విడుదల చేసి, కేంద్ర కమిటీ 360 డిగ్రీల్లో డ్రోన్ ద్వారా పాఠశాల అభివృద్ధిపై పర్యవేక్షణ నిర్వహించనున్నట్లు సమాచారం.

క్రీడలతో మానసిక స్థైర్యం పెంపు

హసన్‌పర్తి: క్రీడలతో మానసిక స్థైర్యం పెంపొందుతుందని గ్రీన్‌వుడ్ విద్యాసంస్థల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు అన్నారు. హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో 'వింటర్ స్పోర్ట్స్ కార్నివాల్ మీట్' శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపునకు యత్నించాలని సూచించారు. చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పదిహేను రోజులపాటు పోటీలు కొనసాగుతాయని వివరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ ప్రభుకుమార్, అకాడమిక్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సరేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో భరద్వాజ్ నాయుడు

వ్యాపారులకు అండగా ఉంటాం



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పరిధిలోని వాణిజ్య, వ్యాపారులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చాంబర్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఆర్ ప్యానల్ అభ్యర్థులు ఏనుమాములోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిపించి రెండేళ్లపాటు చాంబర్ ఆఫ్ కామర్స్‌లో బాధ్యతలు అప్పగించినందుకు తనవంతుగా వ్యాపారుల సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. వ్యాపారుల సంక్షేమానికి కృషి చేస్తున్న తమ ప్యానల్‌కు మళ్లీ ఇంకో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు మడూరి వేదప్రకాశ్, కటకం పెంటయ్య, సాగర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.